21న జాతీయ మహిళా అధ్యాపకుల సదస్సు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 19 : అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక మహాసంఘ్ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఉస్మానియా విశ్వవిద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో జాతీయ మహిళా అధ్యాపకుల సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎం. శైలజ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం మహా సంఘ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యాదయ్యతో కలిసి సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సదస్సుకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధామూర్తి హాజరవుతారని, 1200 మందికిపైగా మహిళా అధ్యాపకులు పాల్గొంటారని తెలిపారు. దేశ నిర్మాణంలో మహిళల పాత్ర, వారి హక్కులు, సవాళ్లు తదితర అంశాలపై సదస్సులో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 200లకు పైగా పరిశోధనపత్రాలను సమర్పిస్తారని తెలిపారు.

దోమల్ని దరిచేరనీయొద్దు..

వెంగళరావునగర్, సెప్టెంబర్ 19 : దోమల్ని దరిచేరనీయొద్దని, దోమకాటు ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం వెంగళరావునగర్‌లోని తన ఇంటి పరిసరాలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. వానకాలంలో ఇంటి పరిసరాల్లో నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతాయనన్నారు. దోమకాటుతో డెంగీ, మలేరియా బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని..పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్ నాయకుల గృహ నిర్బంధం

నర్కూడలో డీసీసీబీ డైరెక్టర్ సతీశ్‌ను హౌజ్ అరెస్టు చేసిన పోలీసులు

పెద్దతూప్ర గ్రామంలో మాజీ ఎంపీపీ జయమ్మశ్రీనివాస్ దంపతులను హౌజ్ అరెస్టు చేసిన పోలీసులు

పిరంచెరువు గ్రామంలో బీఆర్ఎస్ బండ్ల గూడ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు నాగరాజును హౌజ్ అరెస్ట్ చేసిన పోలీసులు

ఉప్పర్‌పల్లిలో బీఆర్ఎస్ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డితోపాటు అనుచరులను అరెస్ట్ చేసిన పోలీసులు

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 19 : బీఆర్ఎస్ నాయకుల గృహ నిర్బంధం కొనసాగుతున్నది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు రైతులకు రైతుబంధు, రైతు భరోసా పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతి భవన్ ముట్టడికి పిలుపు ఇవ్వడంతో బీఆర్ఎస్ నాయకులను గురువారం పోలీసులు ముందస్తుగా హౌజ్ అరెస్టు చేశారు. నర్కూడ గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు, డీసీసీబీ డైరెక్టర్ బుర్కుంట సతీశ్‌ను ఆయన నివాసం వద్ద అరెస్ట్ చేశారు. అదేవిధంగా మాజీ ఎంపీపీ జయమ్మశ్రీనివాస్ దంపతులను మండలంలోని పెద్దతూప్ర గ్రామంలో హౌజ్ అరెస్టు చేశారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మంచర్ల మోహన్‌రావు, వెంకట్‌రెడ్డి, చిన్నగండు రాజేందర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులకు పోలీసులు హౌజ్ అరెస్టు చేశారు.

ఎక్కడికక్కడ బీఆర్ఎస్ శ్రేణుల నిర్బంధం

బండ్లగూడ : అధికారంలోకి వస్తే ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు రైతులను మోసం చేశారని బీఆర్ఎస్ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు రావులకోళ్ల నాగరాజు అన్నారు. బీఆర్ఎస్ పిలుపు మేరకు ప్రగతి భవన్ ముట్టడి సందర్భంగా రాజేంద్ర నగర్ నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చక పోగా రైతు రుణమాఫిని 40 శాతం కూడ చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని గద్దె దింపే వరకు పోరాటం ఆగదన్నారు. రాముడు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పర్‌పల్లిలో...

బీఆర్ఎస్ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి, అతడి అనుచరులను రాజేంద్రనగర్ పోలీసులు హౌజ్ అరెస్ట్ చేశారు. గిరిబాబు,శేఖర్, ఇద్రిస్, శివగౌడ్, అరవింద్, రాముయాదవ్ ఉన్నారు.

పాలమాకుల వసతిగృహంలో మార్పు

- ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- గురువారం రాత్రి హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన చైర్మన్

పాలమాకుల కస్తుర్బా గాంధీ హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 19 : పాలమాకులలోని కస్తుర్బా గాంధీ గిరిజన హాస్టల్‌లో కొంతమేర మార్పు జరిగిందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. గురువారం రాత్రి పాలమాకుల హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులతో వేర్వేరుగా మాట్లాడారు. హాస్టల్‌లో భోజనశాలను పరిశీలించి కూరలు, అన్నం, చికెన్‌ను పరిశీలించారు. అనంతరం కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ.. పాలమాకుల హాస్టల్‌లో కొంతమేర మార్పు వచ్చిందని తెలిపారు. పాఠశాలలో సైన్స్ ల్యాబ్, లైబ్రరీ ఏర్పాటు చేయాలని విద్యార్థులకు తన దృష్టికి తీసుకువచ్చినట్లు వివరించారు. శానిటరి ప్యాడ్ బర్నింగ్ యంత్రాన్ని స్టోర్‌లో పెట్టినట్లు విద్యార్థులు చెప్పారని, వారికి అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పీఈటీ, ఎస్వో, ఏఎన్ఎం పోస్టుల భర్తీ కోసం కలెక్టర్‌తో మాట్లాడుతానని ఆయన విద్యార్థులకు హామీ ఇచ్చారు. చైర్మన్ వెంట ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, రాంబాబు, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి శంకర్, రాష్ట్ర కార్యదర్శి పులి కల్సన, పులి నవీన్ తదితరులు ఉన్నారు.

26 నుంచి అంతర్ పాఠశాలల క్రీడలు

- ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో పోటీలు

జూబ్లీహిల్స్,సెప్టెంబర్ 19 : హైదరాబాద్ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి 28 వరకు ఖైరతాబాద్, షేక్‌పేట్ జోన్ అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు ప్రారంభం కానున్నాయి. హెచ్‌డీఎస్‌జీఎఫ్ క్రీడల్లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో బాలబాలికలకు వేర్వేరుగా కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించనున్నారు. ఈ క్రీడా సంవత్సరంలో జిల్లా స్థాయి పోటీలకు ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేసేందుకుగాను అండర్-14, 17 విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు హెచ్‌డీఎస్‌జీఎఫ్ 68వ జోనల్ లెవల్ టోర్నీ కమ్ సెలక్షన్ మీట్ 2024-25ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇందులో భాగంగా అంతర్ పాఠశాలల క్రీడలను జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డలోని డాన్‌బాస్కో పాఠశాలలో నిర్వహించనున్నట్లు క్రీడల ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్. విశ్వేశ్వరరావు తెలిపారు. పోటీల్లో పాల్గొనే పాఠశాలల జట్లు ఉచిత ఎంట్రీ ఫారాలను యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9849321834 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

శారదాధామంలో సైన్స్ ఫెయిర్

బండ్లగూడలోని శ్రీ శారదాధామంలో సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న ఆర్‌జేడీ విజయలక్ష్మిని సన్మానిస్తున్న అధ్యాపకులు

బండ్లగూడ, సెప్టెంబర్ 19 : ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభకు పదును పెట్టాలని రాష్ట్ర విద్యా ప్రాంతీయ సంచాలకులు(ఆర్‌జేడీ) విజయలక్ష్మి అన్నారు. బండ్లగూడ జాగీర్ శ్రీ శారదాధామం శ్రీ సరస్వతి విద్యా పీఠంలో భాగ్యనగర్ విభాగ్ అధ్వర్యంలో గురువారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్‌జేడీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ఆలోచనలోనే నూతనత్వం వస్తుందని, నూతనత్వం అనేది ఆవిష్కరణలకు మూలబిందువు అవుతుందన్నారు. ప్రతి విద్యార్థి తనలోని పరిశీలనా శక్తిని పెంచుకోవాలని ఇందుకు పుస్తకాలు అధ్యయనం చేయాలన్నారు. కార్యక్రమంలో గోకరి అర్జున్ గౌడ్, కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్, దశరథరెడ్డి, డాక్టర్ అమరేందర్, సంహాద్రి సూర్యనారాయణ, భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ రెగ్యులర్, వన్‌టైం పరీక్షల రీవాల్యూయేషన్ ఫలితాలు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 19: ఓయూ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల రెగ్యులర్, వన్‌టైం చాన్స్ పరీక్షల రీవాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీబీఏ, బీకామ్, బీఎస్సీ తదితర కోర్సుల అన్ని సెమిస్టర్ల రెగ్యులర్, బ్యాక్‌లాగ్, వన్‌టైం చాన్స్ పరీక్షల రివాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

నార్సింగి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సైబరాబాద్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ అధికారులు

మణికొండ, సెప్టెంబర్ 19: విద్యార్థులకు చిన్న నాటి నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని సైబరాబాద్ పోలీస్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ అధికారులు వి. రాఘవేందర్,ఏ.నవీన్‌చారి పేర్కొన్నారు. నార్సింగి ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో వారు మాట్లాడుతూ.. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలను ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలు వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ట్రాఫిక్ నిబంధనలను తెలుసుకుని ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ అదికారులు మల్లేశ్వరరావు, మల్లేశ్వర్, మస్తాన్, సొసైటీ ఫర్ సైబర్ సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులు నీతా వడ్డేరే, వీర సాకేత్, అందె లక్ష్మణ్‌రావు, దిలీప్ కక్కడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాస పోటీల విజేతలకు నగదు బహుమతులు

బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు నగదు బహుమతులను అందజేస్తున్న ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 19: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు వ్యాసరచన పోటీలు దోహదపడతాయని బాబు జగ్జీవన్‌రామ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. ఇటీవల పండరీనాథ్ ఫౌండేషన్ సంస్థ నిర్వహించిన వ్యాస రచన,వ్యక్తిత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు గురువారం నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో సత్తా చాటాలన్నారు. ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు.

వెంచర్ పనులను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

గండిగూడలో వెంచర్ పనులను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 19: అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని శంషాబాద్ తాసీల్దార్ రవీందర్ దత్తు తెలిపారు. మండలంలోని గండిగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 25,26లో కొందరు జీవో 111కు విరుద్ధంగా వెంచర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలుసుకున్న రెవెన్యూ అధికారులు గురువారం అక్కడకు చేరుకొని వెంచర్ పనులను అడ్డుకుని నిలిపివేయించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ రవీందర్ దత్తు మాట్లాడుతూ.. శంషాబాద్ మండలంలో వెంచర్లతోపాటు చెరువు శిఖం, చెరువుల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ భూములను అక్రమిస్తే ఊరుకునేది లేదని, మండలంలో ఎక్కడైనా భూ అక్రమణలు జరిగినట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

బండ్లగూడ,సెప్టెంబర్ 19 : అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పద్మావతీపాపయ్య యాదవ్ అన్నారు. గురువారం కార్పొరేటర్ 7వ డివిజన్ పరిధిలోని నర్సారెడ్డి కాలనీ,రాధానగర్ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను అమె పరిశీలించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావలన్నారు.

విద్యుత్ బకాయిలపై దృష్టి సారించాలి

విద్యుత్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ శ్రీరామ్మోహన్

బండ్లగూడ, సెప్టెంబర్ 19: విద్యుత్ సంస్థకు వినియోగదారులే రక్షకులని, వారి నుంచి బకాయిలను సకాలంలో వసూలు చేయాలని రాజేంద్రనగర్ విద్యుత్ ఎస్ఈ శ్రీరామ్మోహన్ సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ కార్యాలయంలో డీఈ రత్నాకర్‌రావు అధ్యక్షతన వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. విద్యుత్ అధికారులు క్షేత్రస్థాయిలో బకాయిలపై దృష్టి సారించాలన్నారు. వినియోగదారులతో సఖ్యతగా మెలుగుతూ సంస్థ బలోపేతానికి సమష్టిగా పని చేయాలన్నారు. సమావేశంలో సర్కిల్ ఎస్ఏవో వీర స్వామి, అకౌంట్స్ ఆఫీసర్(రెవెన్యూ) హరీశ్ చంద్రశేఖర్, డీఈఎంఆర్‌టీ సోమశేఖర్, డీఈడీపీఈ సత్యనారాయణ, డీఈ రామచంద్రయ్య, ఏఏఓ, తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు తల్లి చెంతకు..

బండ్లగూడ, సెప్టెంబర్ 19 : తప్పిపోయిన బాలుడిని ఓ హోంగార్డు తల్లి వద్దకు చేర్చిన ఘటన గురువారం బండ్లగూడ పరిధిలో జరిగింది. ఆరాం ఘర్ చౌరస్తాలో తన 10 ఏండ్ల కొడుకు తప్పిపోయాడంటూ ఓ తల్లి రోదిస్తున్నది. అక్కడే విధుల్లో ఉన్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ పీఎస్‌కు చెందిన హోంగార్డు రవికుమార్ వెంటనే స్పందించి తప్పిపోయిన బాలుడిని వెతికి పట్టుకొని తల్లి చెంతకు చేర్చాడు. దీంతో తల్లీకొడుకులు మురిసిపోగా స్థానికులు హోంగార్డును అభినందించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 19 : హిమాయత్‌సాగర్ చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన గురువారం శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్వాల్‌గూడ రెవెన్యూ పరిధిలోని హిమాయత్‌సాగర్ చెరువులో ఓ వ్యక్తి పడి ఉన్నట్లు సమాచారం అందింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడికి సుమారు 40 ఏండ్ల వయసు కలిగి ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఓయూ ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్స్ ఫర్ ఉమెన్ పోటీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 19: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్స్ ఫర్ ఉమెన్ పోటీలను ఖరారు చేసినట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఐసీటీ (వుమెన్) కార్యదర్శి ఒక ప్రకటన విడుదల చేశారు. భద్రుకా కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 27న సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు.

వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించాలి

- ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ శారదాజయలక్ష్మీదేవి
- ప్రొ. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రెండు రోజుల సదస్సు

తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రఘురామిరెడ్డిని సన్మానిస్తున్న పీపీఏఐ అధ్యక్షుడు శరత్‌బాబు, పాల్గొన్న వీసీ శారదాజయలక్ష్మీదేవి తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, సెప్టెంబర్ 19 : దేశంలో వ్యవసాయ అనుబంధ రంగాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత ప్రోత్సహించాలని ఆంధ్రప్రదేశ్ ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ (ఎఎన్‌జీఆర్ ఎయు) వైస్ చాన్సలర్ డాక్టర్ శారదాజయలక్ష్మీదేవి అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫ్ ఇండియా(పీపీఏఐ) అధ్యక్షుడు డాక్టర్ శరత్‌బాబు ఆధ్వర్యంలో జరిగే రెండు రోజుల సదస్సుకు గురువారం మొదటిరోజు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారత్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలపైనే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎక్కువ ఉపాధి అవకాశాలున్నాయన్నారు. దేశానికి అన్నం పెట్టే రంగాన్ని నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. వ్యవసాయ రంగంలో పురుగుమందులు, జీవ రసాయనాల వాడకంపై సుధీర్ఘ చర్చజరిగింది. పీజేటీఎస్‌ఏయూ రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి మాట్లాడుతూ రైతులకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై వీడియో, ఆడియో మాధ్యమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. లేబర్ కొరతను గుర్తించి డ్రోన్‌లతో పురుగు మందుల పిచికారీ చేయడం వల్ల యువతకు సైతం ఉపాధి లభిస్తుందన్నారు. వ్యవసాయ రంగంలో శాస్త్రవేత్తలు, రైతులను ప్రోత్సహించడం వల్ల తెలంగాణలో అనతి కాలంలోనే అనూహ్య మార్పు చూశామన్నారు. చైనా, నెదర్లాండ్ టెక్నాలజీకి తీసి పోని విధంగా మన దేశంలోనూ పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. పరిశోధనలతో పాటు రైతులను ఎప్పటికప్పుడు చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని అప్పుడే మంచి ఫలితాలు సాధించవచ్చని వారు పేర్కొన్నారు. కాగా ఎక్కువ దిగుబడి సాధించాలనే ఉద్దేశంతో దేశంలో పురుగుమందుల వాడడం పెరిగిందన్నారు. సేంద్రీయ ఎరువులు,బయో కెమికల్స్, ఫార్మింగ్, విత్తన పరిశోధన, పరిశీలన, పంట మార్కెట్ విధానం తదితర అంశాలపై సీనియర్ శాస్త్రవేత్తలు ఏఎన్‌జీఆర్ఏయూ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ చెరుకూరి శ్రీనివాస్‌రావు, ఏఏసీఆర్‌పీ వీడ్స్, పీజేటీఎస్ఏయూ ప్రిన్సిపాల్ సైంటిస్టు హెడ్ డాక్టర్ టి.రామ్‌ప్రకాశ్, డాక్టర్ టీపీకే సింగ్, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ శ్రీనివాస్‌రావు, డాక్టర్ ప్రదీప్ కుల కర్ని, ఆగ్రోకెమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ డా.కళ్యాణ్‌బిగోస్వామి, ఐపీ ఇండస్ట్రీస్ హెడ్ డాక్టర్ కేఎస్ త్యాగరాజన్, దేశంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొని చర్చించారు.

వినాయక లడ్డూ దక్కించుకున్న ఎన్ఆర్ఐ

కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్‌తో కలిసి లడ్డూ అందుకుంటున్న ఎన్ఆర్ఐ ప్రవీణ్ పటేల్

జూబ్లీహిల్స్, సెప్టెంబర్ 19 : యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్ శ్రీసాయి గణేశ్ వినాయక మండపంలో లడ్డూను ఎన్ఆర్ఐ దక్కించుకున్నాడు. ఆస్ట్రేలియాలో ఉంటున్న ప్రవీణ్ పటేల్ మాతృభూమిపై మమకారంతో నవరాత్రోత్సవాలకు హాజరై వేలంలో రూ. 2.30 లక్షలకు లడ్డూను దక్కించుకున్నాడు. కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్ ఎన్ఆర్ఐకి లడ్డూను అందజేసి అభినందించారు.

1.50 లక్షలు పలికిన లడ్డూ



శంషాబాద్ రూరల్ : బహదూర్‌గూడ అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద లడ్డూను రూ. 1.50 లక్షలకు దక్కించుకున్న యాదయ్యగౌడ్

మహమ్మద్ ప్రవక్త జీవితం మానవాళికి ఆదర్శం

- ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

రహ్మత్‌నగర్ డివిజన్ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, ముస్లింలు

జూబ్లీహిల్స్,సెప్టెంబర్ 19: ప్రజలు శాంతి, సామరస్యాలతో జీవించాలని బోధించిన మహమ్మద్ ప్రవక్త జీవితం మానవాళికి గొప్ప సందేశమని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా గురువారం రహ్మత్‌నగర్ డివిజన్‌లో మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి కార్పొరేటర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్

యూసుఫ్‌గూడ డివిజన్‌లో మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వెంకటగిరి చౌరస్తాలో మైనార్టీ నాయకులు హాజర్ ఆజం ఏర్పాటు చేసిన వేడుకల్లో కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సంతోష్‌ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌దాస్,మాధవి, చిన్నా, షఫీ, ఆయాజ్, అల్తాఫ్, రహీం, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

శాస్త్రిపురంలో..

వ్యవసాయ యూనివర్సిటీ : శాంతి సామరస్యాలకు శాస్త్రిపురం నిలయమని బీఆర్ఎస్ డివిజన్ నాయకుడు ఎండీ ముక్రమ్‌ఖాన్ అన్నారు. గురువారం రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని శాస్త్రిపురంలో మిలాద్‌ఉన్ నబీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు కాలనీల్లో సహపంక్తి భోజనాలు చేశారు. పలువురు నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

యూసుఫ్‌గూడ డివిజన్‌లో వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్

ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం ..

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 19: ప్రజా సమస్యలను తెలుసుకుని వాటికి శాశ్వత పరిష్కారం చూపుతున్నామని అత్తాపూర